"వీరాభిమన్యు"

శశిభూషణ్

విశాలమైన ఆ గదిలో భారత ప్రధానమంత్రి, హోం మంత్రి, సి. బి. ఐ. డైరెక్టర్, అహమ్మదాబాద్ అంతరిక్ష కేంద్రం గ్రౌండ్ కంట్రోల్ డైరెక్టర్ ధనంజయ్ వున్నారు. భయంకరమైన నిశ్శబ్దం నియంతలా అక్కడ రాజ్యమేలుతూంది.

"జంటిల్ మెన్!" ప్రధానమంత్రి కంఠం హఠాత్తుగా నిశ్శబ్దాన్ని ఛీల్చింది.

"ఆర్థికాభివృద్ధిని సాధించటానికి అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు పరచక తప్పదు. అందుకని ప్రభుత్వం ఎన్నో పథకాలు రూపొందిస్తోంది. శాటిలైట్స్ సహాయం ద్వారా భూమిలోని ఖనిజ సంపదలను కనుగొనడమే

కాకుండా, వరదల రాక, పోకడలను, వాతావరణ పరిస్థితులను, పంటల దిగుబడిపై అంచనాలను కూడా వేయడమే ఆ పథకాల ముఖ్యోద్దేశం. ఆ ఉద్దేశ్యంతోనే ఉపగ్రహం 'వీరాభిమన్యు' నిర్మింపబడింది.

దాని ప్రయోగం ప్రభుత్వం ఆశిస్తున్న విధంగా ఈ నెల పదెనిమిదవ తారీఖున జరిగిపోవాలి! ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆ డేట్ మారదు—మారకూడదు. వీరాభిమన్యులో అంతరిక్షయాత్ర చెయ్యడానికి వుద్దేశింపబడిన ఏస్ట్రోనాట్స్ ముగ్గురు. వినోద్, శర్మ, మైథిలి. పదెనిమిదవ తారీఖున ప్రయోగింపబడనున్న శాటిలైట్ అంతరిక్షయాత్రకి ముగ్గురూ విముఖత చూపిస్తున్నారు ప్రస్తుతం. అది నాకెంతో ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది.

అసలు ఏస్ట్రోనాట్స్ ఇంత హఠాత్తుగా మనసు ఎందుకు మార్చుకున్నారో ఇప్పటికీ నా కర్థం కావడం లేదు. వారి ప్రవర్తనతో మనకు విచిత్రమైన సమస్య ఎదురైంది. ఇప్పటికిప్పుడు యింత హఠాత్తుగా క్రొత్త వ్యోమగాముల్ని తయారు చెయ్యలేము. ఎదురైన పజిల్ని సాల్వ్ చెయ్యటం ఎలా? ఆలోచించండి. అందరూ ఆలోచించండి. ప్రయివేట్ ఇన్వెస్టిగేటర్స్ సహాయం ఈ సందర్భంగా మనకు వుపయోగపడుతుందా? ఏమైంది ఏస్ట్రోనాట్స్కి? వారి బ్రెయిన్ ఎవరైనా వాష్ చేసివుంటారా?''

ప్రధానమంత్రి మౌనం వహించేసరికి చిన్నగా దగ్గాడు, అహమ్మదాబాద్ రాకెట్ సెంటర్ గ్రౌండ్ కంట్రోల్ డైరక్టర్ ధనంజయ్ అభ్యంకర్. ''మన దురదృష్టంచేత మూడుమాసాల క్రితం అంతరిక్షంలోకి ప్రయోగింపబడిన

శాటిలైట్ 'భాగ్యరేఖ' ధ్వంసమైపోయింది. అందుకు కారణం హఠాత్తుగా భాగ్యరేఖలో ఏర్పడిన కొన్ని సాంకేతిక లోపాలు! భాగ్యరేఖ మనం వూహించని విధంగా భూమ్మీద కూలిపోయింది.

ప్రస్తుతం 'వీరాభిమన్యు'కి ఏస్ట్రోనాట్స్‌గా నియమింపబడిన వ్యక్తులు భాగ్యరేఖ ధ్వంసమైపోయిన సంగతి పాయింట్ అవుట్ చేస్తున్నారు. తమకు అటువంటి దుర్గతిపట్టడం ఇష్టంలేదని మొండికెత్తుతున్నారు.

మనిషి మనస్సు విచిత్రమైనది. మనిషి మానసికంగా దుర్బలుడు అయినపుడు విచిత్రమైన రుగ్మతకి లొంగిపోతాడు. దాన్నే మెంటల్ బ్రేక్ డౌన్ ద్యూటు సైకిక్ డిసోలేషన్ అంటారు. అది ఒక మానసిక వ్యాధి. ఆవ్యాధికి గురైన వ్యక్తులు కర్తవ్యాన్ని మర్చిపోవటం, పిచ్చిపిచ్చిగా మాట్లాడటం సహజం. విపరీతమైన భయం, ఆందోళన, గాని మనిషి మనసును ఆ స్థితికి తేవటానికి తోడ్పడుతాయ్.

ఆ విధమైన మానసిక స్థితిలో వుండే వ్యక్తులకు ధైర్యం చెప్పాలి! వారి శక్తి యుక్తుల మీద, సామర్థ్యంమీద నమ్మకం కలిగించాలి. అందుకు సైక్రియాటిస్టులు అవసరం. ఈ వేళ తారీఖు రెండు. శాటిలైట్ ప్రయోగానికి ఇంకా పదహారు రోజులు వుంది. ఏస్ట్రోనాట్స్ మూడ్ మారటానికి ఈ వ్యవధి సరిపోతుందని నా నమ్మకం."

"మీ అభిప్రాయం ఏమిటి?" సి. బి. ఐ. డైరెక్టర్ ముఖంలోకి చూశారు ప్రధానమంత్రి.

"ఏస్ట్రోనాట్స్‌ని ఎవరైనా బెదిరించివుంటే; ఆవ్యక్తుల్ని మా ఏజంట్స్ ఏరివెయ్యగలరు. అవసరమైతే నేనే

స్వయంగా పరిశోధనకు పూనుకుంటాను'' నిశ్చలంగా బదు లిచ్చాడు సి.బి.ఐ. డైరెక్టర్.

"వెల్!" అని చకచక ఏవో ఆర్డర్లు జారీ చేశారు ప్రధానమంత్రి.

2

నున్నటి మొజాయిక్ ఫ్లోర్ మీద కదులుతున్నాయ్ పాతిక జంటలు. వెస్ట్రన్ మ్యూజిక్ ఓ తెరచాటునుంచి విన్పిస్తోంది. మ్యూజిక్‌కి అనుగుణంగా డాన్స్ చేస్తున్నారు ఏభైమంది.

అది ముబారక్ నైట్‌క్లబ్‌లోని డాన్సింగ్ హాల్.

ఢిల్లీలో ముబారక్ నైట్‌క్లబ్ వివరాలు చాలా మందికి తెల్సు. ఎక్కువ మంది గౌరవనీయులు ఈ క్లబ్‌కి రావ టానికే ఇష్టపడుతుంటారు. అందుకు కారణంవుంది.

ముబారక్ నైట్‌క్లబ్‌లో అసహ్యకరమైన కేబరే, సర్వెంట్ డాన్స్ ప్రదర్శనాలు వుండవు. క్లబ్‌లో మెంబర్ షిప్ లేనివాళ్ళు అక్కడకు ప్రవేశంచలేరు. ప్రవేశించా లంటే క్లబ్ మెంబర్ సిఫారసు అవసరం. దానితోపాటు టెంపరరీ మెంబర్‌షిప్ కూడా తీసుకోవాల్సి వుంటుంది.

హాట్ డ్రింక్స్ ముబారక్ నైట్‌క్లబ్‌లో సరఫరా చెయ్యబడతాయి. కాని, ఏటువంటి గొడవలూ అక్కడ ఎప్పుడూ జరగలేదు. ఆ క్లబ్‌కొచ్చే వారిలో ఎక్కువ మంది ఆడవాళ్ళే వుంటుంటారు.

తన డాన్స్‌మేట్ సుప్రియతోబాటు కదులుతున్నాడు విమల్. సుప్రియ సాధారణమైన కాల్ గర్ల్. దుస్తుల కంటే ఎక్కువగా మగవాళ్ళని మార్చటం ఆమెకు అల వాటు. వృత్తిధర్మంకూడా.

ఇహపోతే విమల్. అతనొక విచిత్రమైనవ్యక్తి. ఆనందపుటంచులు అందుకోవాలని చాలా రోజులుగా ప్రయత్నిస్తున్నాడు. వయసు మూడుపదులు కావస్తున్నా వివాహం గురించి యోచించకుండా నిశ్చితంగా బ్రతికేస్తున్నాడు.

స్త్రీ విషయంలో కాస్త దుర్బలుడు విమల్. రెండేళ్ళ క్రితంవరకు యూరోపియన్ గర్ల్స్‌మీద ఇష్టం వుంచుకున్నాడు. అటుతర్వాత ఓ ముస్లిం యువతితో స్నేహం చేశాడు. ఆమెతో విసిగిపోయి, ఓ చైనీస్ గర్ల్‌ని సంపాదించుకున్నాడు. చివరికి అతని దృష్టి బెంగాలీ యువతుల మీదకు తిరిగింది.

సుప్రియ బెంగాలీ యువతి కాదు.

విమల్‌కి బెంగాలీ యువతి ఎవరూ ఇంకా పరిచయం కాలేదు. ఆ వేటలోనే మునిగున్నాడతను. ఆవేళ క్లబ్‌కొస్తూనే సుప్రియ అందంగా నవ్వి పలకరించింది. అతనికి మూడు గంటలపాటు కంపెనీ ఇవ్వటానికి తను సిద్ధంగా వున్నట్టు తెలిపింది.

కాదనలేకపోయాడు విమల్. అందుకే ఇప్పుడు సుప్రియతో కల్సి డాన్స్ చేస్తున్నాడు.

విమల్ అహమ్మదాబాద్ రాకెట్ సెంటర్ గ్రౌండ్ కంట్రోల్ డైరెక్టర్ కుమారుడని సుప్రియకు తెలుసు.

"విమల్!" చిన్నగా పిల్చింది సుప్రియ.

"ఏమిటి" అడిగాడు విమల్—ఆమె పెదవులమీద సున్నితంగా ముద్దు పెట్టుకొని.

ఇద్దరూ డాన్స్ చేస్తూనేవున్నారు. మిగిలిన జంటల గురించి వాళ్ళు పట్టించుకోవటం లేదు. వీరి గురించి మిగిలిన జంటలూ అంతే.

"నువ్వు పెళ్ళి విషయం ఆలోచించకుండా ఇలా రోజులు గడిపెయ్యటం మంచిగా లేదు. ప్లీజ్...తొందరగా వివాహం చేసుకో!" అందామె.

"ఎవర్ని?"

మందహాసం చేసింది సుప్రియ. "నన్ను మాత్రం కాదు. అంతటి స్వార్థం నాకు లేదు. నీకు నచ్చిన యువతిని చేసుకో!"

"నీ సలహాకి కృతజ్ఞతలు. కానీ, అటువంటి యోచనలు చెయ్యటం లేదు ప్రస్తుతం నేను. ఇంకో రెండు సంవత్సరాలవరకు పెళ్ళిగురించి ఆలోచించకూడదని నిర్ణయించుకొనివున్నాను."

ఆ తర్వాత మాట్లాడలేదు సుప్రియ. ఇద్దరూ డాన్స్ మాని, రెస్టారెంట్ బార్ సెక్షన్ వైపు వెళ్ళబోయారు. ఇంతలో ఓ బలమైన హస్తం విమల్ భుజం మీద పడింది.

వెనుదిరిగి చూశాడు విమల్. ఆరడుగుల ఆరు అంగుళాల ఎత్తున్న దృఢకాయుడు కన్పించాడు.

"హల్లో, అభిమన్యూ!" నవ్వుతూ పలకరించాడు విమల్ ఆ దృఢకాయుణ్ణి. "మనం కల్సుకుని చాలారోజులైంది."

అవునన్నట్లు తల పంకించాడు అభిమన్యు.

సుప్రియను తన ఫ్రెండ్ కి పరిచయం చేశాడు విమల్ ముగ్గురూ బార్ సెక్షన్ లోకి వెళ్ళి, ఒక మూల బల్లముందు కూర్చున్నారు. సప్లయిర్ వచ్చిన వెంటనే విస్కీ ఆర్డరిచ్చాడు అభిమన్యు.

హాట్ డ్రింక్ బల్లమీదకు వచ్చింది.

"మిస్టర్ అభిమన్యూ! మీరు చాలా అందంగా వున్నారు" విస్కీ కాస్త సిప్ చేసి గ్లాసును బల్లమీదుం

చింది సుప్రియ. "ఎంత అందంగా వున్నారో తెలుసా?"

"చెప్పండి!" సిగరెట్ వెలిగించుకున్నాడు అభిమన్యు.

"మగాళ్ళు అందంగా వుంటారని నాకు తెలుసు. కాని, ఎంత అందంగా వుంటారో ఇప్పుడు తెలుస్తోంది. ఇది పొగడ్త కాదు. మీవంటి హాండ్‌సమ్ చాప్‌ని నేను చూడటం ఇదే మొదటిసారి."

చిన్నగా నవ్వాడు అభిమన్యు — తన సమాధానం అదే నన్నట్లు.

"ప్రియా!" విమల్ పెదవులు కదిలించాడు. "నీవు కొండచిలువవంటి దానివి. నీ దృష్టిలో పడిన మగాడు తప్పించుకోలేడు. ఒప్పుకుంటాను. కానీ, అభిమన్యు విష యంలో ఎందుకైనా మంచిది, కాస్త జాగ్రత్తగావుండు. వాడొక హై ఎక్స్‌ప్లోజివ్. ఆల్ రౌండ్ ప్లేయర్. జేబు దొంగలు మొదలుకొని హంతకులవరకు వాడి స్నేహితులు వున్నారు."

"యూ నాటీ!" బల్లక్రిందున్న విమల్ కాలు తొక్కింది సుప్రియ కసిగా.

"ఇట్సాల్ రైట్!" నవ్వేశాడు విమల్. "నాకు వేరే ఎంగేజ్‌మెంట్ వుంది. మీరిద్దరూ ఎంజాయ్ చెయ్యండి. బై!" సమాధానం ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు.

"మా జాతి మీద మీ అభిప్రాయం ఏమిటి?" అడి గింది సుప్రియ గ్లాసులోకి విస్కీ ఒంపుకొని.

"మీ జాతి అంటే...?"

"ఆడజాతి."

బల్లమీదున్న ఏష్ట్రేలో సిగరెట్ నుసి రాల్చాడు

అభిమన్యు. "ప్రియా! మనమధ్య మన్నించి మాట్లాడుకోవడం అవసరమని నేననుకోవటం లేదు. ఇహ నీ ప్రశ్నకు సమాధానం విను. ఆడదానికి, ఆఫ్రికన్ కోబ్రాకి పెద్దగా తేడా వున్నట్టు నా కనిపించలేదు. మహాసామ్రాజ్యమైనా పతనమైపోవడానికి ఆడదాని కన్నీటి బొట్టు ... లేదా చిర్నవ్వు ఒక్కటి చాలు!"

నవ్వింది సుప్రియ. "అ...భి...మ...న్యు..." మళ్ళీ నవ్వింది. "మన స్తత్వంలాగే మీ పేరుకూడా విచిత్రంగానే వుంది డియర్, మే ఐ నో వాట్ ఆర్ యు?" అడిగింది.

"జేబులు కొడతాను. ఓపిక చిక్కిన ప్రతిసారీ దోపిడీలు కూడా చేస్తుంటాను. మరి నీ సంగతి?"

"నేనొక నింపోమానియక్‌ని."

ఆమె డేర్ నెస్‌కి ఆశ్చర్యపోయాడతను. "అంటే ఒకే మగాడితో, ఒకే విధమైన సుఖంతో సరిపెట్టుకోవడం నీకిష్టం లేదన్నమాట."

"అన్నమాట కాదు, ఉన్నమాటే!" అతని చేతివ్రేళ్ళ మధ్యవున్న సిగరెట్ లాక్కుని, రెండు దమ్ములు లాగి తిరిగి యిచ్చేసింది సుప్రియ. "కాని, జీవితాన్ని తేలిగ్గా తీసుకొని, నిర్లక్ష్యంగా బ్రతికే నీవంటి ప్లే బోయ్‌స్ అంటే ఎక్కువ యిష్టం చూపుతుంటాను. నిన్ను చూశాక ఇటుపై మగాళ్ళను మార్చే అవకాశం వుండదేమో అన్పించింది."

ప్రసంగం కావాలనే మార్చాడు. "ఈ క్లబ్‌కి తరచుగా వస్తుంటావా?"

"ప్రతిరోజూ వస్తాను. రాకుంటే నాకే నష్టం."

మరో అరగంట తర్వాత ఇద్దరూ బార్‌లోంచి బయటకు వచ్చారు.

అభిమన్యు చేయి అందుకొని నొక్కింది సుప్రియ. "నీతో కల్సి డాన్సు చెయ్యడానికి నేను యిష్టపడుతున్నాను."

"సారీ, ప్రియా! బార్‌లో బిల్లు చెల్లించడంతో నాపర్సు ఖాళీ అయ్యింది. తొందరగా ఏదో ఒక జేబు వెతుక్కోవాలి. లేకుంటే నేను ఇబ్బంది పడాల్సివుంటుంది. నీకోరిక మరోసారి తీరుతుంది గుడ్ బై!"

క్లబ్‌లోంచి బయటకొచ్చాడు అభిమన్యు. పేవ్‌మెంట్ మీద నిలబడి సిగరెట్ వెల్గించుకున్నాడు.

"డియర్!"

తల తిప్పిచూశాడు. సుప్రియ కన్పించింది. "కమ్ నియర్" అన్నాడు నవ్వుతూ.

అభిమన్యు దగ్గరగా వచ్చి, అతని చేయి అందుకుంది సుప్రియ. "నీ హస్తకౌశలం చూడాలనివుంది."

"అదేమంత భాగ్యం? పద."

ఇద్దరూ పేవ్‌మెంట్ మీద అడుగులెయ్యసాగారు.

అభిమన్యు ఎవరి జేబు కత్తిరిస్తాడో, ఎలా కత్తిరిస్తాడో చూడాలని వుబలాట పడుతోంది సుప్రియ.

రాత్రి ఎనిమిది గంటలు దాటి ఎనిమిది నిమిషాలైంది. రోడ్లమీద ట్రాఫిక్ అధికంగా వుంది. పేవ్‌మెంట్స్‌మీద కాలినడకన వెళ్తున్నవారి సంఖ్యకూడా అధికంగానే వుంది.

3

తన ఎదురుగా మరొక సోఫాలో కూర్చునున్న ఏస్ట్రోనాట్స్‌ని పరిశీలనగా చూశాడు గ్రౌండ్ కంట్రోల్ డైరెక్టర్.

ఏస్ట్రొనాట్స్ వినోద్, శర్మ, మైథిలి నేల చూపులు చూస్తున్నారు.

"మిస్ మైథిలీ!" నెమ్మదిగా పిలిచాడు జి. సి. డి. ధనంజయ్ అభ్యంకర్.

నెమ్మదిగా తల ఎత్తింది మైథిలి.

"వీరాభిమన్యు ప్రయోగం ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆగ కూడదని గౌరవనీయులైన మన ప్రధాని అన్నారు. నా అభిప్రాయం కూడా అదే. పత్రికలవాళ్ళకి కావలసినంత మేటర్ చిక్కేలా ప్రవర్తించకండి. శాటిలైట్ ప్రయోగం మానితే సభ్యదేశాల దృష్టిలో మన విలువ తగ్గే ప్రమాదం వుంది. మీ భయం ఏమిటో చెప్పండి. శత్రుగూఢచారులు గాని, ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు సాగించే వ్యక్తులు గాని ఎవరైనా మిమ్మల్ని బెదిరించారా? అసలు ఏం జరిగింది? వివరంగా చెప్పండి."

పమిటతో ముఖం తుడుచుకుంది మైథిలి. "శాటిలైట్ అంతరిక్షంలోకి ఇప్పట్లో ప్రయోగింపబడటం మాకు ఇష్టం లేదు. డియర్ సర్! జరిగింది చెబుతాను. దయచేసి మమ్మల్ని కాపాడండి. మూడు మాసాల క్రితం ప్రయోగింపబడిన 'భాగ్యరేఖ' రాకెట్ సెంటర్‌ని వదిలి పైకి లేచిన వెంటనే మనం అందరూ చూస్తుండగానే నేల కూలిపోయిన దృశ్యం ఇంకా నా కళ్ళ ముందు మెదులుతూనే వుంది. ఆ దుర్ఘటనకి గ్రౌండ్ కంట్రోల్‌లోని కొన్ని సాంకేతిక లోపాలు కారణమని మీరు నిరూపించారు.

అసలు కారణం అది కాదు. ఎవరో కావాలని మన భాగ్యరేఖని ధ్వంసం చేశారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి ఒకతను నాకు ఫోన్ చేశాడు. 'ఈ నెల

పద్ధెనిమిదవ తారీఖున అంతరిక్షంలోకి ప్రయోగింపబడ నున్న శాటిలైట్ విషయం మర్చిపో. నీ తోటి వ్యోమ గాములకు కూడా పరిస్థితి వివరించి, నీ ప్రాణాలతోబాటు వారి ప్రాణాలుకూడా కాపాడు. లేకుంటే ఏం జరుగు తుందో తెలుసా? భాగ్యరేఖకి పట్టిన గతి చూశావు కదా! ఇదీ అంతే!' అని చెప్పి లైన్ కట్ చేశాడు.

సర్, మా ప్రాణాల సంగతి అలా వుంచండి. 'వీరాభి మన్యు' నిర్మాణానికి ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసింది. ఆ శాటిలైట్ ధ్వంసం కావడం మాకిష్టంలేదు. దయచేసి మమ్మల్ని క్షమించండి. శాటిలైట్ ప్రయోగం ప్రస్తుతానికి వాయిదా వేయండి."

"నాన్సెన్స్!" విసుక్కున్నాడు జి. సి. డి.

మైథిలి బాధగా ముఖం చిట్లించింది. జి. సి. డైరెక్టర్ తనమాటలు విశ్వసించలేదేమోననే అనుమానం ఆమెకు కలిగింది.

"ఇటీజ్ జస్ట్ నాట్ పాజిబుల్ టు డిస్ట్రాయ్ అవర్ శాటిలైట్. థియరిటికల్ విషయం అలా వుంచితే ప్రాక్టి కల్‌గా అది అసాధ్యం" ఆవేశంగా చెప్పుకు పోతు న్నాడు జి. సి. డి.

"ఒక శాటిలైట్‌ని ధ్వంసం చెయ్యాలంటే మరొక శాటిలైట్‌ని ప్రయోగించాలి. ఎ. ఎ. సి. గన్స్ విషయం మర్చిపోవచ్చు — ఇక పోతే ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్స్ విషయం. వాటి వేగం కంటే మన శాటిలైట్‌కి నిర్దేశింపబడివున్న వేగం అధికం. అంటే 'వీరాభిమన్యు' ఆకాశంలో నాశనం చెయ్యబడటానికి వున్న అవకాశాలు చాలా తక్కువ.

ఇక రాకెట్ సెంటర్‌లోనే శాటిలైట్ ధ్వంసం

చెయ్యబడటం గురించి వినండి. అది మీకు సంబంధించిన వ్యవహారం కాదు. రాకెట్ సెంటర్ గ్రౌండ్ సెక్యూరిటీ ఫోర్స్ ఆ గొడవ చూసుకుంటుంది. శాటిలైట్ ప్రయోగం జరిగేవరకు దాన్ని కాపాడాల్సిన బాధ్యత గ్రౌండ్ సెక్యూరిటీ ఫోర్స్‌ది.

ఇహపోతే, భాగ్యరేఖ ధ్వంసం అయిన విషయం తీసుకుందాం. భాగ్యరేఖలో వెళ్ళిన ఏస్ట్రోనాట్స్ విధివంచితులు. దురదృష్టం అనుకోకుండా వారి పతనాన్ని కాంక్షించింది. భాగ్యరేఖ గైడెన్స్ అండ్ నావిగేషన్ బృందంలో కొందరు శత్రుగూఢచారులు వుండి, భాగ్యరేఖను ధ్వంసం చేయగలిగారు. శత్రుగూఢచారుల్ని ప్రభుత్వం ఏరివేసింది.

గ్రౌండ్ కంట్రోల్‌ని ఇప్పుడు మీరు నమ్మవచ్చు! వీరాభిమన్యు ప్రయోగం అనుకున్న విధంగానే ఈ నెల పధ్దెనిమిదవ తారీఖున జరిగిపోతుంది. మీకీర్తి శాశ్వతంగా నిల్చిపోతుంది. స్పేస్ టెక్నాలజీలో ఆర్థికాభివృద్ధి సాధించాలని చూస్తున్న ప్రభుత్వంతో సహకరించండి. బెదిరింపు ఫోన్ కాల్స్, వుత్తరాలో అందాయని కర్తవ్యాన్ని మరిచి ప్రవర్తించకండి. మునుపే అనుకున్న సమయానికి 'వీరాభిమన్యు' ప్రయోగింపబడకుంటే అవమానం. మనకు కాదు, దేశానికే అది తీరని అవమానం.

చిన్నగా దగ్గాడు వినోద్. "సర్! మమ్మల్ని మృత్యుముఖానికి పంపటానికి మీరు పడుతున్న అవస్త చూస్తుంటే నాకు జాలేస్తోంది."

"స్టాప్ ది నాన్సెన్స్!"

"వినోద్ నిజమే చెప్పాడని నాకనిపిస్తోంది" గొణిగాడు శర్మ.

"మాకు బ్రతకాలని వుంది." చేతి గోళ్ళకున్న రంగు కేసి చూసుకుంటూ మాట్లాడింది మైథిలి.

"ఆల్ రైట్! మీకు ఇరవై నాలుగు గంటల వ్యవధి ఇస్తున్నాను. బాగా ఆలోచించి అపుడు చెప్పండి మీ అభిప్రాయం" విసురుగా లేచాడు జి. సి. డి. ధనంజయ్.

4

అభిమన్యు, సుప్రియ ఏవో కబుర్లు చెప్పుకుంటూ పేవ్‌మెంట్ మీద అడుగులేస్తున్నారు.

ఐదు నిమిషాల తర్వాత అభిమన్యు ప్రదర్శించిన హస్తకౌశలం సుప్రియని ఆశ్చర్యపర్చింది. అతను ఆ వృత్తిలో ఎంత రాటుదేరి వున్నాడో ఆమెకు ఆ క్షణాల్లోనే అర్థమైంది.

"మిస్టర్, అభిమన్యు! నీ కభ్యంతరం లేకుంటే నా ఎపార్ట్‌మెంట్‌కి వెళ్దాం" హఠాత్తుగా అన్నది సుప్రియ.

"అభ్యంతరం వుంది" బలంగా సిగరెట్ దమ్ములాగాడతను! "ప్రియా! ఇందాక నీలిరంగు ఆక్స్‌ఫర్డ్ సూట్ వాలాని నేను ఢీకొన్నాను. పరస్పరం క్షమాపణ చెప్పుకున్నాం. ఆ క్షణాల్లోనే అతని పర్సు నేను కాజేశాను. అఫ్‌కోర్స్...ఆ సంగతి నీకు తెల్సివుండదని, నీవు చూసి వుండవని నేను అనుకోవటం లేదు. నాకు కాసేపు కంపెనీ ఇచ్చావ్. కృతజ్ఞుణ్ణి. నీ బిల్ పే చెయ్యగలను ప్రస్తుతం ఎంత?"

"డార్లింగ్! మన మధ్య స్నేహం కాకుండా వ్యాపారం చోటు చేసుకోవడం నా కిష్టంలేదు."

"సారీ ప్రియా! నీ ఇంటికి మరోసారి వస్తాను. ఇప్పటికి నన్ను వదిలెయ్."

ఇద్దరూ సమీపంలో నున్న బస్ స్టాప్ ని చేరుకున్నారు.

జేబులోంచి పర్సు తీశాడు అభిమన్యు. దాని లోప లున్న నోట్లు తీసి లెఖ్క పెట్టాడు. తొమ్మిదివందల ఏభై రూపాయలు. అన్నీ పదిరూపాయల నోట్లే. చిల్లర డబ్బులు కూడా వదల్లేదు వీరాభిమన్యు. అరవై రెండు పైసలు. పర్సు ఖాళీ చేసి, చీకట్లో విసిరేశాడు.

ఇరవై నోట్లు సుప్రియకిచ్చాడు. "గుడ్ నైట్."

"జస్ట్ మినిట్..."

ఆగి ఏమిటన్నట్లు చూశాడు.

"చివరికి చిల్లర డబ్బులుకూడా వదల్లేదు. అరవై రెండు పైసలు నీకు లెఖ్కకాదు. అయినా వదల్లేకపోయావ్. డబ్బంటే నీ కంత ప్రేమా?" అడిగింది నవ్వుతూ.

"ప్రేమ కాదు స్వార్థం..." కొత్త సిగరెట్ వెలిగించుకున్నాడు అభిమన్యు. "తొంభై తొమ్మిది పైసలు వున్నా, అవి రూపాయ అని అనిపించుకోలేవు. ఇది కలియుగం ఇందులో హీనులు, వున్నతులు ఎప్పటికీ వుంటుంటారు. ఎవరు ఎంత మేర విజృంభించటం అనేది వారి నైజం మీద, ప్రొఫెషన్ మీద ఆధారపడి వుంటుంది. ఒక చిన్న వుదాహరణ విను.

ప్రథమ భారత స్వాతంత్ర్య సమర మనబడే 'సిపాయిల కలహం' గురించి మేరియమ్ అనే ఆవిడ 1896లో వారణాసి నుంచి ఒక పుస్తకం ప్రచురించింది. 1857 మే నెల 10వ తేదీన మీరట్ తిరుగుబాటు జరిగే నాటికి ఆమె పదిహేనేళ్ళ పిల్ల. తండ్రి షాజహాన్ పూర్ మేజిస్ట్రేటు కోర్టులో ఉద్యోగి. ఆమె యూరేషియన్. అంటే తల్లి ఇండియను, తండ్రి ఆంగ్లేయుడూను.

షాజహాన్‌పూర్‌లో జూన్ నెల మొదటి ఆదివారం ఉదయం ఏడున్నరకి మేరియమ్ తండ్రి, ఆ జిల్లా కలెక్టరు, జిల్లా మెడికల్ ఆఫీసరు చర్చి భవనంలో కిరాతకంగా తిరుగుబాటుదారుల చేత హత్య గావింపబడ్డారు. తన తండ్రి మృతదేహాన్ని కడసారి చూసే అవకాశం మేరియమ్‌కి కలగలేదు. ఎందుకంటే తెల్ల చర్మం కన్పించగానే స్త్రీ, పురుష, బాల్య, వృద్ధ విభేదం లేకుండా ఊచకోత కొయ్యబడుతున్న గడ్డురోజులవి.

మూడు రోజులవరకు ఆమూడు మృతదేహాలు అక్కడే పడున్నాయ్. కాని, వారిజేబుల్లోని డబ్బులు, కాళ్ళకున్న బూట్లు మాత్రం ఎవరో దొంగిలించుకుపోయారు.

ఈ లోకంలో స్వార్థం అనేది ఎక్కడ చూసినా కన్పిస్తుంది. శవాలను నిలువు దోపిడి చేసే స్వార్థపరుల కంటే నేనే నయం ఒకవిధంగా. ప్రియా! నెక్స్ టైం బెటర్ లక్, గుడ్ నైట్!''

''గుడ్ నైట్'' అప్రయత్నంగా బదులిచ్చింది సుప్రియ.

అభిమన్యు చప్పట్లు కొట్టి అటుగా వెళ్తున్న టాక్సీని ఆపాడు. టాక్సీ పేవ్‌మెంట్ ప్రక్కకొచ్చి ఆగింది.

అభిమన్యు చకచక అడుగులేస్తూ టాక్సీని సమీపించాడు.

5

''హల్లో హాండ్‌సమ్!''

ముబారక్ నైట్‌క్లబ్ పోర్టికోలో ఆగిన టాక్సీనుండి క్రిందకు దిగిన అభిమన్యు తలతిప్పి వెనక్కు చూశాడు. సుప్రియ కన్పించింది.

''హల్లో, బేబీ!'' పలకరించాడు నవ్వుతూ.

ఎంట్రన్స్ డోర్ ముందున్న ప్లాట్ ఫాం మీదున్నది సుప్రియ. అభిమన్యు కన్పించగానే ఆమెలో నూతనోత్సాహం వెల్లివిరిసింది. ఎత్తుమడమల జోళ్ళు టకటకలాడించుకుంటూ మెట్లుదిగి, పోర్టికోలోనున్న అభిమన్యు ప్రక్కకొచ్చి, అతని చేయి అందుకుంది.

"రాత్రి ఎనిమిది గంటలుకూడా కాలేదు. అప్పుడే నైట్ క్లబ్ మీదకు గాలి మళ్ళిందా?" అడిగింది మందహాసాన్ని వెదజల్లుతూ.

"గాలి మళ్ళినమాట నిజమే. క్లబ్ మీదకు కాదు. నీపైకి."

"అబద్ధం."

"అబద్ధాలాడటం అంటే నాకసహ్యం" స్వరం బాగా తగ్గించి సుప్రియకు మాత్రమే విన్పించేలా చెప్పాడు అభిమన్యు. "పోలీసులకు మాత్రమే నేను అబద్ధాలు చెపుతూంటాను."

"అచ్ఛా!" బుగ్గలు సొట్టలుపడేలా నవ్విందామె. "నిన్న అంతసేపు బ్రతిమాలినా మా ఇంటికి రాలేదు. ఇప్పుడు 'పనిగట్టుకొని నాకోసం ఇక్కడకు వచ్చావంటే నమ్మలేకపోతున్నాను."

"చచ్చిన నిన్నగురించి యోచించక! పుట్టని రేపు సంగతి ఇపుడు మన కవసరంలేదు. ఈవేళ మీ ఇంటికి వస్తాను. ఇంకా నీవు ఏం చెప్పినా చేస్తాను. ఎక్కడకు రమ్మన్నా వస్తాను. లెట్స్ గో!"

"ఎక్కడికి?"

"నీ ఇష్టం."

"చాలా సంతోషంగా వున్నావ్. బరువైన పర్సు

ఎక్కడైనా చిక్కిందేమిటి?''

''పర్సు కాదు. డైమండ్ నెక్లెస్. అమ్మేసరికి పన్నెండు వేలు వచ్చాయ్. ఆ ఆనందాన్ని నీతో కల్సి పంచుకోవాలని వచ్చాను.''

''థాంక్యూ, డార్లింగ్ ...'' అభిమన్యు చేయిపట్టుకొని క్లబ్ ఆవరణంలోంచి బయటకు లాక్కుపోవాలని చూసిందామె.

ఆమె భుజంమీద చేయివేసి ఆపుచేశాడు అభిమన్యు. ''టాక్సీలో వెళ్దాం.''

''విత్ ప్లెజర్.''

ఇందాక అభిమన్యు వచ్చిన టాక్సీ ఇంకా క్లబ్ పోర్టికోలోనే వుంది. ఇద్దరూ దానిలోకి చేరుకున్నారు.

డ్రైవర్‌కి ఏదో చెప్పింది సుప్రియ.

టాక్సీ కదిలింది.

సిగరెట్ వెలిగించుకొని సీట్లో విశ్రాంతిగా వెనక్కువాలాడు అభిమన్యు. అతని భుజానికి తన భుజాన్ని తాకిస్తూ ప్రక్కనే కూర్చొని వుంది సుప్రియ.

చాణక్యపురికేసి వేగంగా దూసుకెళ్తోంది టాక్సీ.

''ప్రియా!'' పిలిచాడు అభిమన్యు.

ఏవో ఆలోచనల్లో మునిగున్న సుప్రియ తృళ్ళిపడింది. ''యస్... ఏమిటి?'' అడిగింది తల తిప్పుతూ.

''ఒకే మగాడితో జీవితాన్ని పంచుకోవడంలో స్త్రీకి ఆనందం, మనశ్శాంతి వున్నాయ్. నీవు ఆ దారిలో వెళ్లటం లేదు. భయంకరమైన త్రోవగుండా నడుస్తున్నావ్. ఎందరో పురుషులు నీకు పరిచయమై వుండొచ్చు. అయినా అందరూ పరాయివాళ్లే. తన అనే మగవాని అవసరం స్త్రీకి ఎంతైనా వుంది.''

తేలిక భావం వ్యక్తమయ్యేలా నవ్విందామె.

"స్వార్థపరులు ఆ విధంగానే యోచిస్తారు - ఆచరిస్తారు కూడా. నాకా జీవితం నచ్చదు."

"వాడ్డుయు మీన్?"

సుప్రియ పెదవులు కదిలాయ్.

"అయం నిజః పరోవేతి గణనాంలఘు చేతసాం!
ఉదార చరితానాంతు వసుధైవ కుటుంబకం!!"

ఆశ్చర్యపోయాడు అభిమన్యు.

సుప్రియను తను తక్కువగా అంచనా వేసుకున్నట్టు అతని కరథమైంది.

ఆమె పెదవులు తిరిగి కదిలాయ్. "ఇతడు మన, అతడు పరాయి అనే భేదబుద్ధి అల్పమనస్కులకేగాని, విశాల హృదయులకు లోకమంతయు స్వకుటుంబమే."

"నీ ప్రొఫెషన్ని సమర్థించుకుంటున్నావేమో!"

"అటువంటిదేం లేదు. చాలా రోజులుగా నేను ప్రాస్టిట్యూట్‌గానే జీవిస్తున్నాను. డార్లింగ్! నీవు నాకు నచ్చావ్. నీకు అభ్యంతరం లేకుంటే ఈ నిమిషంనుంచి మనం ఒకే ప్రాణంలా జీవించవచ్చు!"

"అది జరగని పనేమో!"

"ఏం?"

"నేను క్రిమినల్‌ని. అంటే యాంటిసోషల్ ఎలిమెంట్ నన్నమాట. మనమధ్య సఖ్యత కుదరదు."

సుప్రియ ఏదో చెప్పబోయి, టాక్సీ ఆగటంతో మౌనం వహించింది.

ఇద్దరూ టాక్సీనుండి క్రిందకు దిగారు. ఫేర్ అభిమన్యు చెల్లించాడు. టాక్సీ రివర్స్ అయి వెళ్ళిపోయింది.

ఎదురుగా పెద్ద ఇల్లు వుంది. దాన్ని అనేక ఫ్లాట్స్‌గా చేసి అద్దెలకు ఇచ్చినట్లు చూస్తూనే తెలుస్తోంది.

ఫ్లాట్ నెంబర్ 'క'లోకి దారితీసింది సుప్రియ. లోపల రెండు గదులున్నాయ్. ముందు గది కాస్త పెద్దది. రెండవది బెడ్‌రూం. దానిలోంచి బాత్రూంకి దారి వుంది.

ముందు గదిలోని ఫర్నీచర్‌ని గోడలమీద వ్రేలాడుతున్న రవివర్మ డూప్లికేట్స్‌ని చూస్తూ సుప్రియ వెనుకే పడగ్గదిలోకి నడిచాడు అభిమన్యు.

ఈ గది మరీ విశాలంగా లేకపోయినా నీట్‌గా వుంది. గోడలకు లేత నీలిరంగు ట్రాన్స్‌పరెంట్ ఎనామిల్ పెయింట్స్, పంజాబీ సుందరీమణుల అర్ధనగ్న చిత్రపటాలు... గదిలో ఒకప్రక్కగా పెద్ద డబుల్ ఫోం బెడ్, దానిమీద నాలుగు తలగడలు, దాని కవతలవైపుగా గోడ వారగా చిన్నబల్ల, బల్లమీద ట్రాన్సిస్టర్, ఫోన్, బల్ల ప్రక్కనే పుస్తకాల రేక్... ఒక ప్రాస్టిట్యూట్ పడగ్గదిలా కన్పించటంలేదు ఆ రూం.

"ఎలా వుంది నా పడగ్గది?" అభిమన్యుని వెనుకనుంచి వాటేసుకుంది సుప్రియ. "నీకు నచ్చిందా?"

"చాలా బావుంది. ఈ ఫ్లాట్‌కి అద్దె ఎంతిస్తున్నావేమిటి?"

"రెండొందలు."

సుప్రియ భుజంపట్టుకొని ముందుకు లాక్కున్నాడు అభిమన్యు. జేబులోంచి వాలెట్ తీసి, పదివందరూపాయల నోట్లు లెక్కపెట్టి ఆమె కిచ్చాడు.

బదులు చెప్పకుండా నోట్లు అందుకుందామె.

"హాట్ డ్రింక్స్ వంటివి ఏవీ లేవా?"

"ఓడ్కా వుంది..." మంచం దగ్గరగా టీపాయ్ లాగి, ముందు గదిలోకి వెళ్ళింది సుప్రియ.

మంచంమీద కూర్చున్నాడు అభిమన్యు.

రెండు నిమిషాల్లో ఓడ్కా బాటిల్, గ్లాసులు తీసుకొని వచ్చింది సుప్రియ. ఇద్దరూ మౌనంగా ఒక రౌండు పూర్తి చేశారు.

సుప్రియ గ్లాసును టీపాయ్ మీదుంచి, లేచి ఒళ్లు విరుచుకుంది. అభిమన్యు చూస్తుండగానే ఒంటిమీదున్న దుస్తులు విప్పేసి, నైట్ డ్రస్ ధరించింది.

"స్టన్నింగ్ బ్యూటీ" అప్రయత్నంగా అన్నాడు అభిమన్యు.

కిలకిలా నవ్వుతూ వచ్చి, అభిమన్యుని వాటేసుకుంది సుప్రియ.

6

చేతికున్న వాచీలో టైం చూసుకున్నాడు ధనుంజయ్ అభ్యంకర్. రాత్రి ఎనిమిది గంటలైంది.

అతనికెదురుగా 'వీరాభిమన్యు' ఏస్ట్రోనాట్స్ ముగ్గురూ వున్నారు. ముగ్గురి గుండెల్లోనూ రైళ్లు పరుగెడుతున్నాయ్.

ధనుంజయ్ అభ్యంకర్ పెదవులు కదిలించాడు, సోఫాలో కొద్దిగా కదిలి.

"మీ కిచ్చిన గడువు ఇరవై నాలుగు గంటలు పూర్తయ్యింది. టెల్ మీ...ఏం నిశ్చయించుకున్నారు?" శాంతంగా అడిగాడు.

శర్మ సమాధాన మిచ్చాడు. "సర్! మీ కుమారుడు విమల్ అభ్యంకర్ నా ప్రాణస్నేహితుడు. మీకున్నది అతనొక్కడే సంతానం. నన్ను విమల్ స్థానంలో వుంచి

కాసేపు ఆలోచించండి. నేను విమల్ అయివుంటే... మీ కుమారుడైవుంటే ఇటువంటి పరిస్థితుల్లో నన్ను అంతరిక్ష యాత్రకి ప్రోత్సహించగలరా?"

"నీ సమాధానం ఏమిటి?" అభ్యంకర్ చూపులు వినోద్ పైకి తిరిగాయ్.

"నేను ఈ దేశ పౌరసత్వాన్నే వదిలెయ్యాలని అనుకుంటున్నాను. అయాం వెరీ సారీ."

"అమ్మాయ్! నీవు?"

మైథిలి గొణిగినట్లు మాట్లాడింది. "సహజ మరణం ప్రాప్తించే వరకు తన ప్రాణాలు కాపాడుకునే హక్కు ప్రతి ఒక్కరికీ వుంది. చారిత్రాత్మకంగా చావటానికి నేను సిద్ధంగా లేను. క్షమించండి."

మందహాసం చేసేడు అభ్యంకర్. "మీమనసు మారే వరకు మీకు స్వేచ్ఛవుండదు. మీరే నన్ను క్షమించాలి!"

అదిరిపడ్డారు ఏస్ట్రోనాట్స్.

"మిస్టర్ హితేశ్వర్" అరిచాడు అభ్యంకర్.

ప్రక్క గదితలుపు తెరుచుకుంది. రాకెట్ సెంటర్ గ్రౌండ్ సెక్యూరిటీ ఫోర్స్ కాప్టన్ హితేశ్వర్ ప్రత్యక్షమయ్యాడు గుమ్మంలో. అతని కుడిచేతిలో 9 ఎం. ఎం. ఆటోమేటిక్ వుంది.

"వీరు ముగ్గురూ మతి చలించి పిచ్చిపిచ్చిగా వాగుతున్నారు. ఆ గదిలోకి తోసి జాగ్రత్తగా కాపలా కాయండి!" ఆజ్ఞాపించాడు ధనుంజయ్ అభ్యంకర్.

మరమనిషిలా అడుగులేస్తూ ముందుకొచ్చాడు హితేశ్వర్ "అలాగా ముందు మీ వాగుడు మూయిస్తాను" అంటూ ఆటోమేటిక్ను ధనుంజయ్కు గురిపెట్టాడు.

7

అభిమన్యు చేతిపన్న వాచీలోంచి "బీప్...బీప్... క్లూమ్...క్లూమ్" అంటూ విన్పిస్తోంది. అది వాచీ మాత్రమే కాదు. బేటరీ ఆపరేటెట్ వైర్‌లెస్ ట్రాన్స్‌మీటర్ కూడా.

వాచీ కీరాడ్‌ని బయటకు లాగి, తిప్పి పెట్టాడు అభిమన్యు. వాచీ లోపలవున్న ప్రసారయంత్రం పని ప్రారంభించింది.

"హై కమాండ్ పోస్ట్ స్పీకింగ్...హై కమాండ్ పోస్ట్ స్పీకింగ్...కాలింగ్ అభిమన్యు...కాలింగ్ అభిమన్యు...ఓవర్!"

అభిమన్యు రిస్ట్‌వాచిని నోటిముందుకు తెచ్చాడు.

"అభిమన్యు రిసీవింగ్...అభిమన్యు రిసీవింగ్...హై కమాండ్ పోస్ట్...గో ఎహెడ్ ఓవర్!"

అభిమన్యు ప్రక్కనే ఫోంబెడ్ మీద వెల్లకిలా పడుకొనివున్న సుప్రియకి ఆశ్చర్యంగా వుంది. అభిమన్యును తను చాలా తక్కువగా అంచనా వేసిందేమిటి?

ఐదు నిమిషాల్లో ట్రాన్స్‌మిషన్ ముగించాడు అభిమన్యు. కీరాడ్‌ని యథాప్రకారం అమర్చుకున్నాడు.

"డార్లింగ్!" అతని ఛాతీమీద చేతిని పోనిచ్చింది సుప్రియ ఇద్దరూ అర్ధనగ్నంగా వున్నారు.

"ఏమిటి?" అడిగాడు సిగరెట్ వెలిగించుకొని.

"హు ఆర్ యూ?"

"అభిమన్యు."

"అదికాదు. నీ వెనుక పెద్ద చరిత్ర వున్నట్టు నాకనిపిస్తోంది. ఇందాక ట్రాన్స్‌మీటర్‌లో ఎవరితోనో

మాట్లాడావ్. నీ రహస్యాలన్నీ తెల్సుకోవాలనిపిస్తోంది."

"అది జరుగదు. మన వృత్తులు వేరు కావటమే అందుకు కారణం."

"అంటే నీవు నన్ను నమ్మటం లేదా?"

"లేదు. ఒకరిని నమ్మటం నా వృత్తి ధర్మానికి విరుద్ధం."

నవ్విందామె. "మనం వేర్వేరు వృత్తుల్లో వున్నామని నేననుకోవటం లేదు."

ఆమెను దగ్గరగా లాక్కున్నాడు అభిమన్యు. "నీవు లోకాన్ని మోసపుచ్చటానికి ప్రాస్టిట్యూట్ గా నటిస్తున్నావ్ కదూ?"

"బాగా వూహించావ్, నీవు జేబుదొంగ కాదు నాలాగే లోకాన్ని నీవూ మోసగిస్తున్నావని నా అనుమానం."

"యస్!"

అభిమన్యు పెదలమధ్య ఇరుక్కొనున్న సిగరెట్ లాక్కొని, రెండు దమ్ములు లాగి గదిమూలకు విసిరింది సుప్రియ. "నీవు గూఢచారివి అయివుండాలి. బైదిబై... ఏదేశం తరఫున పనిచేస్తున్నావ్?"

"నేను గూఢచారిని కాదు. ఆ జాతికి చెందిన కొందరు వ్యక్తులు నా సహాయం అడిగారు. కాదనలేకపోయాను. వారికి సహాయపడుతున్నాను. మరి నీ సంగతి?"

"నేనొక దేశం తరఫున గూఢచారి కార్యకలాపాలు సాగించటానికి భారతదేశంలోకి ప్రవేశించాను. ఆదేశం... ఐమీన్... నా మాతృదేశం గురించి చెప్పను."

"తెల్సుకోవాల్సిన అవసరం నాకంతకంటే లేదు. నా కప్పగించబడిన పని కాస్త పెద్దదే. అది నిర్విఘ్నంగా

పూర్తి కావటానికి నీ సహాయం కొంత కావాలి."

"నిన్ను, నీ మాటల్ని ఎలా నమ్మటం?"

"ధాకూ ధాకూకే ఊపర్ హోషిష్ రహనా."

"మనం దొంగలం కాదు" అందామె నవ్వుతూ.

"ఆమాటల కర్థం అది కాదు. ఏజాతి పక్షులు, ఆజాతి పక్షుల్ని నమ్మాలి."

"అచ్ఛా! నాద్వారా నీకు కావల్సిన సహాయం ఏమిటో చెప్పు."

కాసేపు మౌనంగా వుండిపోయాడు అభిమన్యు. "ప్రియా! నిన్ను నమ్ముతున్నాను..." ఒక్క క్షణం ఆగి తిరిగి ప్రారంభించాడు. "ఈనెల పదెనిమిదవ తారీఖున భారత ప్రభుత్వం 'వీరాభిమన్యు' అనే శాటిలైట్ ని అంత రిక్షంలోకి ప్రయోగించబోతుంది. దానికి ఏస్ట్రోనాట్స్ గా వినోద్, శర్మ, మైధిలి అనే వ్యక్తులు ఎన్నుకోబడ్డారు. వాళ్ళు ముగ్గురూ నాకు కావాలి."

"అంటే ఆ ముగ్గురినీ కిడ్నాప్ చేయాలంటావ్?"

"యస్!" సుప్రియ పెదవుల మీద చూపుడు వ్రేలితో రెండు సున్నాలు చుట్టాడు అభిమన్యు. "వంద తుపాకులు చెయ్యలేని పనిని ఒక్క ఆడది నిర్విఘ్నంగా పూర్తి చెయ్యగలదని నాకు తెల్సు. నీవు పూనుకుంటే వ్యోమ గాములు నా ఆధీనం అవుతారు."

"డార్లింగ్! అపాయంలోకి నన్ను పంపాలని చూస్తున్నావ్. నేను ఆడదాన్ని. వెళితే తిరిగి రాలేనని నీకు నిజంగా తెలియదా?"

"డోంట్ ఆక్ట్ సిల్లీ. ఈవిషయాన్ని సీరియస్ గా తీసు కొని ఆలోచించు."

"ఓ. కె." బుగ్గలు సొట్టలుపడేలా నవ్వింది సుప్రియ. "ఏస్ట్రోనాట్స్ నీ ఆధీనం అవుతారు. ప్రతిఫలంగా నీవు నాకొక సహాయం చేయాలి."

"సహాయమా?"

"దాన్ని నీవు ఏ విధంగా అనుకున్నా పర్వాలేదు. వీరాభిమన్యుకి ఎన్నుకోబడిన వ్యోమగాములు నీకొక్కడివాలి. నాకేం కావాలో తెలుసా? నీ శక్తియుక్తులు... శాటిలైట్ వీరాభిమన్యు, ప్రయోగింపబడక మునుపే ధ్వంసమై పోవాలి."

అర్థం కానట్టు చూసాడు అభిమన్యు.

"అర్థంకాలేదా?" అభిమన్యు పాదాలమీద ముద్దుపెట్టుకుంది సుప్రియ. "ఈ నెల పద్దెనిమిదవ తారీఖున ప్రయోగింపబడనున్న ఉపగ్రహం వీరాభిమన్యుని నీవు నాశనం చెయ్యాలి. అందుకు నీవే సమర్థుడివని నాకు అన్పిస్తోంది."

చిన్నగా నవ్వాడు అభిమన్యు. "అంత సులభం కాదు. రాకెట్ కేంద్రంలోకి ఎవరు ప్రవేశించాలన్నా అనుమతి అవసరంవుంటుంది. కొత్త వాళ్ళకు రాకెట్ సెంటర్‌లోకి ప్రవేశార్హతవుండదు, శాటిలైట్ వీరాభిమన్యు సంరక్షణ భారం నిమిత్తం ఎంతో సెక్యూరిటీ ఏర్పాటు చేయబడి వుంటుంది. అందరి కళ్ళూ గప్పి రాకెట్ కేంద్రంలోకి ప్రవేశించడం కష్టం. ప్రవేశించినా శాటిలైట్ నాశనం చేయడం మరింత దుర్లభం.

ఎలాగో ఆ పనీ పూర్తిచేసినా; ఆతర్వాత ప్రాణాలతో బయటపడటం సాధ్యంకాదు."

"ఈ అణుయుగంలో మనిషికి అసాధ్యమైనది ఏదీ లేదు..." కొన్ని క్షణాలు మౌనం వహించిందామె.

"డార్లింగ్ ఏస్ట్రోనాట్స్‌తోబాటు పాతిక కిలోల బంగారంకూడా నీ కివ్వడానికి సిద్ధంగా వున్నాను, బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రా!"

"టూ హెల్ విత్ యు అసలు రాకెట్ కేంద్రంలోకి ప్రవేశించటం ఎలా?"

"సింపుల్" అభిమన్యు దగ్గరగా జరిగింది సుప్రియ. "దొంగచాటున కాకుండా అధికార హోదాలో నీవు రాకెట్ కేంద్రంలోకి ప్రవేశిస్తావ్. నీవు జేబుదొంగవు కాదు. సి.బి.ఐ. ఏజంట్‌వి. ఆ విధంగా నిన్ను నిరూపించి చూపించగల ఐడెంటిటీ కార్డ్ నీ కివ్వబడుతుంది. సి.బి.ఐ. ఏజంట్స్‌ని ఎవ్వరూ అడ్డగించరు."

"అర్థమైంది. మొదట వ్యోమగాముల విషయం తేలి పోవాలి!"

"ఆ విషయంగా నీవు చింతించాల్సిన అవసరం లేదు. వినోద్, శర్మ, మైథిలి ప్రస్తుతం నా ఆధీనంలోనే వున్నారు."

ఆశ్చర్యపోయాడు అభిమన్యు.

8

అంబాసిడర్ కాబ్ బాక్ సీట్లో సుప్రియ, అభిమన్యు వున్నారు. వేగంగా దూసుకెళ్తోంది టాక్సీ. డ్రైవర్ దృష్టి సంతా డ్రైవింగ్ మీద కేంద్రీకరించి వున్నాడు.

రాత్రి పదిగంటలు దాటి పదకొండు నిమిషాలైంది.

అభిమన్యు గుండెల్లో అరేబియన్ గుర్రాలు గాలప్ తీస్తున్నాయ్. మస్తిష్కంలో సముద్ర కెరటాల్లా ఆలోచనలు ఎగిరెగిరి పడుతున్నాయ్.

సుప్రియ ముఖం గంభీరంగా వుంది. నిశ్చింతగా సీట్లో

రిలాక్స్ అయివున్నదామె.

టాక్సీ బ్రిటిష్ ఎంబసి ప్రాంతానికి వచ్చింది.

"ప్రియా!" పిలిచాడు అభిమన్యు.

"ఊఁ!" అందామె అప్రయత్నంగా.

"గమ్యం యింకా ఎంత దూరం వుంది?"

"తినబోతూ రుచి అడగటం అవివేకం."

సుప్రియ తెలివైన ఆడదని అతనికి అర్థమైంది. తెలివైన ఆడదాన్ని మాటల్లో జయించాలని ప్రయత్నించే మగవానికి సహజంగా ఓటమి ఎదురవుతుంటుంది.

ఆతర్వాత మాట్లాడలేదు అభిమన్యు. సిగరెట్ కాల్చాలని అన్పించినా బలవంతంగా ఆ కోరికనుఅణచుకున్నాడు ఈగల్లా ముసురుతున్న ఆలోచనల్ని దూరంగా తరిమేసే ప్రయత్నం చెయ్యకుండా మౌనంగా వుండిపోయాడు.

సుప్రియ ఏదేశ గూఢచారిణి అయ్యుంటుంది? అర్థం కావటంలేదు అభిమన్యుకి.

టాక్సీని ఓచోట ఆపించింది సుప్రియ.

అభిమన్యు, సుప్రియ టాక్సీనుండి దిగారు. టాక్సీ ఫేర్ సుప్రియ చెల్లించింది.

టాక్సీ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

సమీపంలో పేవ్ మెంట్ మీదున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ వైపు అడుగులేసింది సుప్రియ, అభిమన్యు చేయి పట్టుకొని.

అర నిమిషంలో ఇద్దరూ బూత్ ని సమీపించారు.

"ఎక్స్ క్యూజ్ మీ, డార్లింగ్" బూత్ లోకి వెళ్ళి తలుపు వేసుకుంది సుప్రియ.

ట్రాఫిక్ ని చూస్తూ నిలబడ్డాడు అభిమన్యు.

పధ్దెనిమిది నిమిషాల తర్వాత బూత్‌లోంచి బయట కొచ్చింది సుప్రియ. "రెండు ప్రదేశాలకు ఫోన్ చేశాను. అందుకే ఇంత ఆలస్యం అయ్యింది" అంది అభిమన్యు చేయి అందుకుంటూ.

"ఐ.సీ! మనకోసం వాహనం వస్తుందా?"

"సరిగ్గా వూహించావ్."

ఎనిమిది నిమిషాలు భారంగా దొర్లిపోయాయ్.

సర్రున దూసుకొచ్చిన డిసోటా వీరికి కాస్త దూరంలో ఆగింది పెద్ద కుదుపుతో.

అభిమన్యు చేయి అందుకొని, డిసోటా వైపు అడుగు లేసింది సుప్రియ.

డిసోటా బాక్‌సీట్లో ఇద్దరు ముస్లిమ్ యువకులు వున్నారు. జిన్నా టోపీలు ధరించారు. సిల్కు లాల్చీ, గళ్ళలుంగీ ధరించాడు ఒకతను. మెడలో తాయెత్తు వ్రేలాడుతోంది. రెండో వ్యక్తి స్కిన్ టైట్ స్వెట్టర్, పాంటు వేసుకొన్నాడు. అందంగా కత్తిరించుకున్నాడు గెడ్డం.

స్టీరింగ్ ముందు ఓ యువతి వుంది.

"నీవు బాక్‌సీట్లో కూర్చో" చెప్పింది సుప్రియ.

కిక్కురుమనకుండా డిసోటా బాక్‌సీట్లో మధ్యన కూర్చున్నాడు అభిమన్యు. అతని కిరువైపులా ముస్లిం యువకులు!

డ్రైవర్ ప్రక్కన కూర్చుంది సుప్రియ.

డిసోటా కదిలింది.

అభిమన్యు కళ్ళకు గంతలు కట్టబడ్డాయ్.

"సుప్రియా! వాటీజ్ దిస్?" అరిచాడు అభిమన్యు.

"శేకిట్ ఈజీ డార్లింగ్. మా రహస్య స్థావరం గురించి నీకు తెలియటం మాకు ఇష్టంలేదు. దిసీజ్ జస్ట్ ప్రికాషన్ ఓన్లీ. మరొక సంగతి కూడా చెపుతున్నా విను. నా పేరు సుప్రియ కాదు - ఎరీకా."

బదులు చెప్పలేదు అభిమన్యు.

అరగంటపాటు తిరిగిన వీధుల్లోనే తిరిగింది డిసోటూ. చివరికి భూమి గుండ్రంగా వుందని నిరూపిస్తూ చాణక్య పురిలోకి ప్రవేశించింది.

ప్రయాణం ఎటువైపు సాగుతున్నదో అభిమన్యుకి అర్థం కావటం లేదు.

9

అభిమన్యు కళ్ళకు కట్టబడిన గంతలు విప్పెయ్యబడ్డాయ్.

"ఠంగ్... ఠంగ్..." మంటూ వరుసగా పదకొండు గంటలుకొట్టి మౌనం వహించింది గోడ గడియారం.

కళ్ళు నులుముకొని చుట్టూ కలయజూశాడు అభిమన్యు. తను విశాలమైన ఓ హాల్ మధ్య నిలబడివున్నట్టు తెల్సుకున్నాడు. అతని కెదురుగా ఐదు కుర్చీలు వున్నాయ్. వాటిల్లో ధనుంజయ్, విమల్, వినోద్, శర్మ, మైథిలి బంధింపబడి వున్నారు.

బంధితులకు ఒకప్రక్క ముస్లిం యువకులు ఇద్దరు, రెండోవైపు ఇద్దరు అందమైన యువతులు షాట్ గన్స్ ధరించి నిలబడున్నారు.

ఒకప్రక్కగా ఖరీదైన సోఫా సెట్టు వుంది. నాలుగు పదులు నిండిన వ్యక్తి ఓ సోఫాలో కూర్చుని సిగార్ కాల్చుకుంటున్నాడు. అతను పాకిస్తాన్ గూఢచారి

ఖాసింఖాన్ అని అభిమన్యుకి తెలియదేమో.

అభిమన్యు ప్రక్కనే నిలబడున్న సుప్రియ వురఫ్ ఎరీకా చిన్నగా దగ్గింది. "నీవు కోరిన వ్యోమగాములు వాళ్ళేనని ఇప్పటికైనా అంగీకరిస్తారా?" అడిగింది నవ్వుతూ.

తల అడ్డంగా వూపాడు అభిమన్యు. "వీళ్ళు నకిలీ వ్యక్తులు అయివుండాలి. అసలు వ్యక్తులు అయివుండరు వీళ్ళు."

"మిస్టర్ అభిమన్యూ!" పిలిచాడు ఖాసింఖాన్.

అభిమన్యుని తీసుకొని ఖాన్ దగ్గరకు వచ్చింది ఎరీకా. "మీట్ మిస్టర్ ఖాసింఖాన్... నా తండ్రి... బాబా! ఇతనే అభిమన్యు. డేరింగ్ ఎక్స్‌ప్లోజివ్" పరిచయం గొడవ ముగించిందామె.

ఖాసింఖాన్‌తో చేయి కలిపాడు అభిమన్యు.

ఖాన్ తిరిగి తన సోఫాలో రిలాక్స్ అయ్యాడు. అతని కెదురుగానున్న సోఫాలో అభిమన్యు, ఎరీకా కూర్చు న్నారు.

ఖాన్ పెదవులు కదిలాయ్. "మిస్టర్ అభిమన్యూ! మేము పాకిస్తాన్ ఏజంట్స్ అని నీకిప్పటికే అర్థమై వుంటుందని అనుకుంటున్నాను."

"అఫ్‌కోర్స్ - నకిలీ ఏస్ట్రోనాట్స్‌ని మీ రెందుకు బంధించారో ఇప్పటికీ నా కర్థం కావటంలేదు."

చిన్నగా నవ్వాడు ఖాసింఖాన్. "నీవు పొరబడు తున్నావ్. నకిలీ ఏస్ట్రోనాట్స్ గ్రౌండ్ కంట్రోల్ డైరెక్టర్ ధనుంజయ్ అభ్యంకర్ నివాసంలో హాయిగా వున్నారు. వీళ్ళు అసలు వ్యక్తులే."

బంధితుల ముఖాల్లో రంగులు మారుతున్నాయ్.

"బాబా అబద్ధం చెప్పటంలేదు, డార్లింగ్" తన తండ్రి మాటలకు వంత పాడింది ఎరీకా.

"ఇట్సాల్ రైట్. మీ అధీనంలో నకిలీ వ్యక్తులు లేరనే అనుకుందాం. నేను చేయవల్సిందేమిటో చెప్పండి?" అడిగాడు అభిమన్యు.

ఆరిపోయిన సిగార్ని టీపాయ్‌మీదున్న ఏష్ట్రేలో కుక్కాడు ఖాసింఖాన్. "నీ గురించి ఎరీకా చాలా చాలా చెప్పివున్నది. మైడియర్ అభిమన్యూ! నీవు ఎవరి తరఫున పనిచేస్తున్నా నాకనవసరం. నీకు ఏస్ట్రోనాట్స్ కావాలి. నిరభ్యతరంగా తీసుకెళ్ళు. కాని..." ఆగాడు.

"కాని?" అడిగాడు అభిమన్యు.

"అహమ్మదాబాద్ అంతరిక్ష కేంద్రంలోనున్న శాటిలైట్ 'వీరాభిమన్యు'ని నీవు ధ్వంసం చేయాలి."

"అది మాటలతో అయ్యే పనికాదని మీ అమ్మాయికి ఇదివరకే చెప్పివున్నాను."

నవ్వాడు ఖాసింఖాన్. "అహమ్మదాబాద్ అంతరిక్ష కేంద్రం గ్రౌండ్ సెక్యూరిటీ ఫోర్స్ కాప్టన్ హితేశ్వర్ని నేను అంతం చేశాను. అతని వేషంలో చాలా రోజులుగా తిరుగుతున్నాను. 'వీరాభిమన్యు'కి ఎన్నుకోబడిన ఏస్ట్రోనాట్స్‌ని కిడ్నాప్ చేసి, వారి స్థానంలో నకిలీ వ్యక్తుల్ని వుంచాను. గ్రౌండ్ కంట్రోల్ డైరెక్టర్ని, ఆయన కొడుకును ఇక్కడ బంధించాను. ఈ పనులన్నీ కూడా మాటలతో అయివుండవు. దేనికైనా తెగింపు కావాలి.

నీకు అవసరమయ్యే అన్ని అనుకూలాలు, సహాయాలు నేను చేస్తాను. నీవు చేయవల్సింది ఒక్కటే. ముందు

వెనుకలు ఆలోచించకుండా బుల్లెట్ లాగా దూసుకెళ్ళి టార్గెట్ ని తాకాలి. శాటిలైట్ 'వీరాభిమన్యు' పద్దెనిమిదవ తారీఖు లోపలే ధ్వంసం కావాలి. దట్సాల్!"

"సెక్యూరిటీ కాప్టన్ హితేశ్వర్ హోదాలో మీరే వెళ్ళి శాటిలైట్ ని ధ్వంసం చేయవచ్చు కదా! అవకాశం వున్నా మీ రెందుకు దాన్ని వుపయోగించుకోవటం లేదు?" అడిగాడు అభిమన్యు.

"సరైన ప్రశ్నే వేశావ్" ఖాసింఖాన్ పెదవులు కదిలాయ్. "నేను హితేశ్వర్ కాదని భారత ప్రభుత్వానికి తెలియటం నా కిష్టంలేదు. మూడు మాసాల క్రితం శాటిలైట్ భాగ్యరేఖ ధ్వంసమైపోవటానికి కారకుణ్ణి నేనే అని భారతీయులు ఎప్పటికీ తెల్సుకోలేరు. హితేశ్వర్ గా నేను యింకా కొంతకాలం చలామణి కావాలనుకుంటున్నాను. అంతేకాదు. అంతరిక్షంలోకి ప్రయోగించటానికి సిద్ధం చేసిన శాటిలైట్ ని ధ్వంసంచేసి, అక్కణ్ణుంచి తప్పించుకొని రావటం కాస్త కష్టమే. అందుకు నీవే సమర్థుడివి. డియర్ అభిమన్యూ, బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రా!

ఎవరి క్రిందనో నీవు పనిచెయ్యడం నా కిష్టంలేదు. ఈ ఆపరేషన్ పూర్తయితే ఎరీకా నీ అర్ధాంగి అవుతుంది. మీ రిద్దరూ పాకిస్తాన్ వెళ్ళిపోవచ్చు. అక్కడ మీకు పాక్ ప్రభుత్వం అన్ని సదుపాయాలూ చేస్తుంది. ఉజ్వలమైన భవిష్యత్తు వుంది నీకు. దాన్ని పాడుచేసుకోవద్దు. నీ వంటి వ్యక్తి జీవించాల్సింది జేబు దొంగతనాలు చేస్తూ కాదు.

మన పరిచయం బంధుత్వంగా మారాలని ఆశిస్తున్నాను. నీ అభిప్రాయం ఏమిటో చెప్పు."

కాసేపు అరచేత్తో నుదురు రుద్దుకున్నాడు అభిమన్యు.

"పదినిమిషాలు వ్యవధి కావాలి!" అన్నాడు తలెత్తి ఖాసింఖాన్‌ని చూస్తూ.

"ఓ.కె!" అన్నాడు పాకిస్తాన్ గూఢచారి ఖాసింఖాన్.

బంధితుల గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయ్. అందరి చూపులూ అభిమన్యు పైనే వున్నాయ్.

నిముషాలు గడుస్తున్నాయ్.

"పది నిమిషాలు పూర్తయ్యాయ్!" అభిమన్యు భుజం మీద చేయి వేసింది ఎరీకా. "బాబాని నిరుత్సాహపరిచే సమాధానం నీ నోటినుంచి బయటపడదని ఆశిస్తున్నాను."

మందహాసం చేశాడు అభిమన్యు - తన సమాధానం అదేనన్నట్టు.

"ధన్..." మంటూ చప్పుడైంది గుమ్మంలో. బుల్లెట్ పైకప్పుని తాకింది. బిలబిలమంటూ ఆ హాల్లోకి ప్రవేశించారు పోలీసులు.

ఆశ్చర్యపోయాడు ఖాసింఖాన్.

"ఆల్ ఆఫ్ యు హేండ్సప్" అరుస్తున్నారు ఢిల్లీ కమీషనర్ ఆఫ్ పోలీస్. "ఏ ఒక్కరు కదిలినా అందరినీ కాల్చి చంపడానికి వెనుకాడము."

పాట్ గన్స్ ధరించిన ముస్లిం యువకులు ఫైరింగ్ ప్రారంభించబోయారు.

"ధన్...ధన్...ధన్...ధన్..."

ముస్లిం యువకులు భీకరంగా అరిచారు పాట్‌గన్స్ జారవిడుస్తూ. మిగిలిన ఇద్దరు యువతుల చేతులనుండి గన్స్ జారిపోయాయ్.

ఖాసింఖాన్ మెరుపు వేగంతో లేచి నిలబడుతూ జేబులోంచి రివాల్వర్ తీయబోయాడు. అప్పటికే ఆలస్యమైంది.

చిఱుతపులుల్లా ఇద్దరు ఇన్ స్పెక్టర్లు ముందుకు దూకి, అతన్ని లొంగదీసుకొని, ఆయుధం స్వాధీనపర్చుకున్నారు.

అభిమన్యుకి తప్ప మిగిలినవాళ్ళ చేతులకు బేడీలు పడ్డాయ్.

బంధితులకు స్వేచ్ఛ లభించింది.

కమీషనర్ ఆఫ్ పోలీస్ ముఖంలోకి కోపంగా చూస్తూ కసికసిగా పళ్ళు కొరికింది ఎరీకా. "అతని పేరు అభిమన్యు. మా మనిషే. అతన్ని మీరు వదిలేశారు."

కమీషనర్ నవ్వాడు. "ఆయన మీ మనిషి కాదు. సి.బి.ఐ. ఏజంట్. పేరు అదే... అభిమన్యు."

హేళనగా నవ్వింది ఎరీకా. "అతను చూపించిన ఐడెంటిటీ రికార్డ్ డూప్లికేట్ ది. ఆ రికార్డ్ అతనికి నేనే ఇచ్చాను..." అరిచింది పిచ్చిగా.

విమల్ చిన్నగా దగ్గాడు. "పొరబడుతున్నావ్, మేడమ్! వాడు జేబుదొంగ కాదు— సి.బి.ఐ. ఏజంట్. నీమీద ఏదో అనుమానం వచ్చిందట. తనకు నిన్ను పరిచయం చేయమన్నాడు. ఎందుకైనదీ... ఆ వివరాలేవీ నాకు అప్పట్లో తెలియవు."

ఎరీకా చూపులు అభిమన్యుమీదకు తిరిగాయ్, "అయితే నీవు సి.బి.ఐ. ఏజంట్ అన్నమాట. నీ పేరు అభిమన్యు కాదన్నమాట. నాతో స్నేహం సంపాదించటానికి ఆ పేరు..."

"నో... యువార్ రాంగ్, ప్రియా అలియాస్ ఎరీకా! నా పేరు అదే" చెప్పాడు సి.బి.ఐ. ఏజంట్ అభిమన్యు. రెండు క్షణాలాగి తిరిగి తనే అన్నాడు.

"మిస్ ఎరీకా! 'భాగ్యరేఖ'ని ధ్వంసం చేసినట్టు 'వీరాభిమన్యు'ని ధ్వంసం చెయ్యటానికి మీకు అవకాశం

లేకపోయింది. అందుకే 'వీరాభిమన్యు'కి ఎన్నుకోబడిన ఏస్ట్రోనాట్స్‌ని దాచేసి, వారి స్థానంలోకి నకిలీ వాళ్ళను ప్రవేశపెట్టి శాటిలైట్ ప్రయోగాన్ని తాత్కాలికంగా ఆపుచేయించాలని ప్రయత్నించారు. ఏస్ట్రోనాట్స్ ఎదురు తిరిగితే శాటిలైట్ ప్రయోగం జరుగదు. ఈ నెల పదెనిమిదవ తారీఖున మునుపే నిర్ణయింపబడిన ప్రకారం శాటిలైట్ 'వీరాభిమన్యు' ప్రయోగం జరుగకుండా ఆగిపోతే ఆ తర్వాత వీలుచూసుకొని దాన్ని స్మాష్ చెయ్యొచ్చని తలంచారు.

కానీ, కథ అడ్డం తిరిగింది.

ఏస్ట్రోనాట్స్ వినోద్, శర్మ, మైథిలి రూపాల్లో మీరు వుంచిన వ్యక్తులు నకిలీ అని మాకు ఎప్పుడో తెలుసు. అయినా వూరుకున్నాం. ఎప్పుడైనా వారినుంచి మాకు కావల్సిన సమాచారం బయటకు వస్తుందేమోననే ఆశతో, అసలు వ్యక్తుల్ని ఎవరు మాయం చేశారో, ఎక్కడ దాచారో తెల్సుకోవాలనే పట్టుదలతో నకిలీ వ్యక్తుల్ని ఫ్రీగా వుంచాము.

నీమీద మాకు అనుమానం కలిగివుండేది కాదు. నీ అనుచరులైన నకిలీ ఏస్ట్రోనాట్స్‌ని ఫ్రీగా వుంచినా వారి మీద స్పై వుంచబడింది. ఆ సంగతి వారికి తెలియదు. వాళ్ళు తరచుగా నిన్ను కల్సుకొనే వాళ్ళు.

సమాజం దృష్టిలో మామూలు ప్రాస్టిట్యూట్‌వి నీవు. అటువంటి నిన్ను నకిలీ ఏస్ట్రోనాట్స్ పదేపదే ఎందుకు కల్సుకున్నారు? అక్కడే కల్గింది నాకనుమానం. మరొక సంగతి. నిన్ను నమ్మించటానికి ఓ జేబు కొట్టాను. అతనెవరో తెలుసా? నాతోటి ఏజంట్."

బదులు చెప్పకుండా తల దించుకుంది ఎరీకా.

చిన్నగా దగ్గాడు ఖాసింఖాన్. "జరిగినదానికి నేను చింతించటం లేదు. గూఢచారులకు జయాపజయాలు కల గటం సహజం. పోలీసులు ఈ ప్రదేశాన్ని ఎలా కనుక్కో కలిగారు? మిస్టర్ అభిమన్యూ! ఇప్పటికీ నాకర్థం కావటం లేదీ సమస్య. నిన్ను డిసోటాలో తీసుకొచ్చారు మావాళ్ళు. డిసోటా వెనుక ఎటువంటి వాహనమూ రాలేదని నమ్మ కంగా చెప్పింది ఎరీకా. అయినా ఈప్రదేశానికి పోలీసులు ఎలా రాగలిగారో అర్థం కావటంలేదు."

అభిమన్యు పెదవులు కదిలాయ్. "మిస్టర్ ఖాన్! భారతీయుల్ని ప్రతిసారీ తక్కువగా అంచనా వేసుకొని భంగపడటం మీకు అలవాటైపోయింది. ఇదే నీ ప్రశ్నకు సమాధానం విను. ఎరీకా ఎపార్ట్మెంట్ నుంచి బయలు దేరాం.దారిలో టాక్సీ ఎక్కి, ఓ పబ్లిక్ టెలిఫోన్ బూత్ వద్ద దిగేశాము. కారు పంపమని ఫోన్ చేసింది ఎరీకా.

డిసోటా మరికొద్ది సేపట్లో వచ్చి ఆగింది. నేను డిసోటా లోకి చేరుకునే సమయంలో నా దగ్గరున్న ఎలక్ట్రానిక్ ఇండికేటర్ని ఆన్ చేశాను. అది కారు ప్రయాణం చేసిన రూట్ని పోలీస్ కంట్రోల్ రూమ్లో స్పష్టంగా తెలియ జేస్తుంది. నా సిగ్నల్ కోసమే ఎదురు చూస్తున్న పోలీస్ కమీషనర్ గారు సులభంగా మీస్థావరాన్ని ముట్టడించడం జరిగింది."

అర్థమైందన్నట్లు తల పంకించాడు ఖాసింఖాన్.

విమల్ చేయి అందుకొని, పోలీసుల కంటే ముందే ఆ హాల్లోంచి బయటకు వచ్చాడు సి. బి. ఐ. ఏజంట్ అభిమన్యు.

-: ఐ పో యిం ది :-